# పంచాయతీ, స్మశాన స్థలాలు ఆక్రమణ

- డ్రైనేజీలు ఆక్రమణ, అద్దె వసూళ్లు
- కబ్జాకోరల్లో బస్టాండు స్థలాలు
- పట్టించుకోని అధికారయంత్రాగం
- బస్టాండులో నిత్యం ఘర్షణలే


బస్టాండు ప్రాంతంలోని డ్రైనేజీ కాలువలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు

**గుర్రంకొండ:** మండలకేంద్రమైన గుర్రంకొండ మేజర్ పంచాయతీ బస్టాండులో పంచాయతీ, స్మశాన స్థలాలను కొందరు కబ్జా చేశారు. చివరకు డ్రైనేజీ కాలువలను కూడా ఆక్రమించుకొని వాటిపై అద్దెలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలు నిర్వహించుకొనే విషయమై నిత్యం బస్టాండులో ఘర్షణలు జరుగుతున్నాయి.

**ఆక్రమిత స్థలాలపై అద్దె వ్యాపారం**

వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిన బస్టాండులో పంచాయతీ, స్మశాన స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించుకున్నారు. ఆక్రమిత స్థలాలపై వేలాది రుపాయలు అద్దెలు కూడా వసూలు చేసుకొంటున్నారు. కబ్జాకు గురైన సదరు స్థలాల్లో సుమారు 100 దుకాణాలను అనధికారికంగా నిర్వహించుకొంటున్నారు. వీటిపై ఆక్రమణ దారులు రూ. 3వేలు నుంచి రూ. 6వేల వరకు అద్దెలు వసూలు చేయడం గమనార్హం. దీంతో పంచాయతీకి ప్రతి నెలా రూ. 5లక్షల మేర ఆదాయం గండిపడుతోంది.

**వీధులకు వెళ్లే దారులు కూడా..**

స్థానిక బస్టాండు నుంచి బజారువీధి, సర్కారుబావి వీధి, కొత్తపేట దర్గావీధులకు వెళ్లే దారులు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో ఆటలోలు వెళ్లే ఈ రహదారుల్లో ప్రస్తుతం ద్విచక్రవాహనాలు సరే మనషులు కూడా నడిచివెళ్లే దారి కనుమరుగు అయ్యింది. దారులు మొత్తం ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో జనం నడవడానికి చోటులేక నానా కష్టాలు పడుతున్నారు.

**నిత్యం ఘర్షణలే**

ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలు నిర్వహించుకొనే విషయమై ఆక్రమణ దారులకు గతంలో దుకాణాలు నిర్వహించుకొనే వారికి మధ్య నిత్యం గొడవలు, ఘర్షణలు జరుగుతున్నాయి. గతంలో వేటకొడవళ్లతో ఇరువర్గాల వారు దాడులకు పూనుకొన్నారు. గతంలో బస్టాండలో ఒకరిని ఈవిషయమై హత్య కూడా చేసిన సంఘటనలు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఘర్షణలు జరుగుతుండడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

**చోద్యం చూస్తున్న అధికారులు**

రహదారులు, బస్టాండు స్థలాలు, పంచాయతీ స్థలాలు కబ్జాలకు గురవుతున్నా పాలకులు, అధికారులు చోద్యం చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారని జనం చర్చించుకొంటున్నారు. ఇటీవల రెండు రోజుల క్రితం బి.కొత్తకోట బస్టాండులో నెలకొన్న ఆక్రమణలను పూర్తి స్థాయిలో అధికారులు తొలగించారు. ఇక్కడ మాత్రం కబ్జా స్థలాల జోలికి వెళ్లాలంటే అధికారులు హడలెత్తిపోతున్నారు. గతంలో ఓ ఎంపీడీఓ ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించారు. అయితే అప్పటి పాలకులు ఎంపీడీఓ చర్యలను అడ్డుకోవడంతో ఆక్రమణలు ఎక్కడ వేసినగొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**నోటీసులు సరే తొలగింపులేవి?**

రెండేళ్ల క్రితం ప్రభుత్వ, పంచాయతీ స్థలాలను ఆక్రమించుకొన్నవారికి అప్పటి అధికారులు నోటీసులు జారీ చేశారు. బస్టాండులో రెవెన్యూ, పోలీసులు, పంచాయతీ అధికారులు సదరు స్థలాలన్ని సర్వే కూడా చేశారు. ఆక్రమణ దారులందకీ నోటీసులు జారీ చేసి ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించారు. అప్పట్లో ఉన్నతాధికారులు కూడా చొరవ తీసుకొని ఆక్రమణలు తొలగించేందుకు అన్ని రకాలు చర్యలు చేపట్టారు. ఆ తరువాత ఎం జరిగిందే తెలియదు కానీ ఆక్రమణలు మాత్రం ఇంతవరకు ఎవరూ తొలగించలేదు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**



బస్టాండులో ఆక్రమణల సమస్య చాలా ఏళ్లుగా ఉంది. గతంలో ఆక్రమణదారులందరికీ అధికారులు నోటీసులు ఇచ్చారు. తరువాత ఎం జరిగిందో తెలియదు. కొత్తగా బాధ్యతలు చేపట్టాను. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకొంటాం. **- హరి, పంచాయతీ ఈఓ**

**కేసులు నమోదు చేస్తాం**



బస్టాండులో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కేసులు నమోదు చేస్తాం. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకొవాలి. నిత్యం జనసంచారం ఎక్కువగా ఉండే బస్టాండులో ఘర్షణలకు దిగి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు తప్పవు.
**- మధురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ**

## క్లుప్తంగా

### గోకులం షెడ్లు మంజూరు

**ములకలచెరువు:** ములకలచెరువు క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాలకు 280 గోకులం షెడ్లు మంజూరైనట్లు డ్వామా ఏపీడీ మధుబాబు తెలిపారు. బుధవారం ఆయన ములకలచెరువులో గోకులం నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... షెడ్లు మంజూరైన లబ్ధిదారులు నాణ్యతగా నిర్మించుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో ఫాంపాండ్స్, ఫీడర్ చానల్స్, హార్టికల్చర్‌లో మొక్కల పెంపకం పనులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

### మాదిగల ఆత్మీయ సభను విజయవంతం చేయండి

**ములకలచెరువు:** మదనపల్లెలో గురువారం నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ నియోజకవర్గ నాయకులు ప్రతాప్, తిరుపాల్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో ఎమార్పీఎస్ ముఖ్య నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి వర్గీకరణ సాధించిన మందకృష్ణ మాదిగ ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన మాదిగలు, మాదిగ ఉపకులాలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### సెల్ఫ్ డిక్లరేషన్‌తో దరఖాస్తు చేసుకోవాలి

**తంబళ్లపల్లె:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పుట్టిన సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అఫిడవిట్‌కు బదులు సెల్ఫ్ డిక్లరేషన్‌తో పాటు స్టడీ సర్టిఫికెట్, మార్కుల లిస్టు ఉంటే సరిపోతుందని తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

### పంచాయతీ నిధులపై ఆడిట్

**పీలేరు :** పీలేరు గ్రామ పంచాయతీలో నిధులు, అభివృద్ధి పనులపై ఆడిట్ నిర్వహించారు. బుధవారం అధికారులు పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జమ, ఖర్చులకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఏవో బి.టి. నాయక్ మాట్లాడుతూ వారం రోజుల పాటు క్షుణ్ణంగా అన్ని రికార్డులు పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

### వృద్ధులకు అన్నదానం

**పెద్దతిప్పసముద్రం:** మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా శబరి ఆశ్రమంలోని 70 మంది వృద్ధులు, పిల్లలకు అన్నదానం చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ బుధవారం పేర్కొన్నారు.

# నీటిసంఘాల ఎన్నిక ప్రక్రియపై అవగాహన

**- ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ రాఘువేంద్ర**


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ రాఘువేంద్ర

**మదనపల్లె :** నీటి సంఘాల ఎన్నిక ప్రక్రియపై అధికారులందరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని మదనపల్లె ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ రాఘువేంద్ర పేర్కొన్నారు. ఈనెల 23న జరగనున్న నీటిసంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో భాగస్వామ్యమయ్యే ఈఓ, ఏఈఓ, పీఓ, ఏపీఓలకు పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో బుధవారం ఒక్కరోజు శిక్షణ సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఈఈ నల్లపరెడ్డి భరత్‌కుమార్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గత అనుభవాలు, ఇప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. సదస్సులో భాగంగా ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ రాఘువేంద్ర పలు అంశాలపై సూచనలు చేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో వంద ఎకరాలకు పైబడిన 63 చెరువులకు సంబంధించి నీటిసంఘాల ఎన్నికలు జరపనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి చెరువుకు 6 సీసీ మెంబర్లును ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. వారి నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎన్నిక మొత్తం ఒకేరోజులో జరిగే ప్రక్రియని, పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే వ్యక్తులకు ఏవైతే నిబంధనలు ఉన్నాయో, వీటికి అవి వర్తిస్తాయన్నారు. ఎన్నికల్లో పోటీచేయాలనుకున్న వారు అదనంగా 1432 ఫసలీ నీటిపన్ను చెల్లించి ఉండాలన్నారు. చెరువుకింద ఆయకట్టుదారుడై ఉండాలన్నారు. నీటిసంఘాల ఎన్నికలు సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఏకగ్రీవం లేదా చేతులు ఎత్తే పద్దతి ద్వారా ఎన్నిక ప్రక్రియ ఉంటుంది కాబట్టి...రైతులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. నీటిసంఘాల ఎన్నికలకు ఈనెల 20న నోటిఫికేషన్, 23న ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని, అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయం మేరకు జరపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రాయల్‌రవీంద్రబాబు, తహసీల్దార్ ఖాజాబీ, నీటిపారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనతోనే నవ సమాజ నిర్మాణం

**- డీఎస్పీ కొండయ్యనాయుడు**


మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

**మదనపల్లె :** విద్యార్థిదశలో భారత రాజ్యాంగం, చట్టాలపై అవగాహన పెంచుకుంటే నవసమాజ నిర్మాణం సాధ్యపడుతుందని డీఎస్పీ కొండయ్యనాయుడు అన్నారు. మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీఐడీ ఆధ్వర్యంలో బుధవారం షెడ్యూల్డ్ తెగల సంఘాల సాధికారత, ఎస్సీ,ఎస్టీలపై అఘాయిత్యాల నివారణపై చైతన్యసదస్సు నిర్వహించారు. సమావేశానికి మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐడీ డీఎస్పీ డీవీ.వేణుగోపాల్, బీటీ కాలేజ్ ప్రిన్సిపల్ ఆర్.కృష్ణవేణి, ఎస్సీ కార్పొరేషన్ జయప్రకాష్, ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకరరెడ్డి, ఏపీపీ వీరాంజనేయులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ... విద్యార్థిదశ నుంచి ఎస్సీ,ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకున్నప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. బీటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ...విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకున్నప్పుడే చట్టాలపై అవగాహన వస్తుందన్నారు. ఏపీపీ వీరాంజనేయులు మాట్లాడుతూ...ఎస్సీ,ఎస్టీ చట్టం, నియమనిబంధనలపై అవగాహన కల్పించారు. భావిషయాల్లో ఎస్సీ,ఎస్టీలకు అన్యాయం జరిగినప్పుడు పోలీసు కేసుతో పాటుగా సివిల్ కేసు పెట్టాలని సూచించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఎస్సీ,ఎస్టీ కేసులపై ప్రభుత్వానికి సమర్పించిన మార్గదర్శకాలపై వివరించారు. తహసీల్దార్ ఖాజాబీ ఎస్సీ,ఎస్టీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం తరపున అందే సహాయసహకారాలు, ప్రయోజనాలు, పరిహారం గురించి వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ జయప్రకాష్ ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రభుత్వపథకాలు, రాయితీలు, లోన్లు, సిఫారసులపై తెలిపారు. సదస్సులో మాలమహానాడు అధ్యక్షులు యమలాసుదర్శనం, బహుజనసేన వ్యవస్థాపకులు శ్రీచందు, 6వవార్డు మున్సిపల్ కౌన్సిలర్ ప్రసాద్‌బాబు సమాజంలో ఎస్సీ,ఎస్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో సీఐడీ సీఐ కుళ్లాయప్ప, ఎస్ఐ వెంకటరమణ, సీఐడీ సిబ్బంది పాల్గొన్నారు.

# వరుస సర్వేలతో వెలవెలబోతున్న సచివాలయాలు

- సిబ్బంది అందుబాటులో లేక అగచాట్లు
- వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్న ప్రజలు


కోళ్లబైలు-2 సచివాలయంలో సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

**మదనపల్లె :** సచివాలయ సిబ్బందికి పలు రకాల సర్వే బాధ్యతలు అప్పగించడంతో గ్రామ, వార్డు సచివాలయాలు వెలవెలపోతున్నాయి. సచివాలయానికి పనులపై వెళ్లే ప్రజలకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఏంచేయాలో తెలియక అగచాట్లు పడుతున్నారు. కూటమిప్రభుత్వం సచివాలయ సిబ్బందికి.. జియోటాగింగ్ సర్వే, ఎన్‌పీసీఐ లింక్(బ్యాంక్‌కు ఆధార్ లింకేజీ), అపాక్స్(ఏపీఏసీఎస్) సర్వే, అపార్ తదితరాలకు సంబంధించి విధులు కేటాయించి, గడువుతేదీలోపు పూర్తిచేయాలని ఆదేశించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలాంటి సర్వేలకు వలంటీర్లు ఉండటంతో పనులు చకచకా జరిగిపోయేవి. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం వలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం కొనసాగించకపోవడంతో, ప్రతి విషయానికి సచివాలయ సిబ్బంది రోడ్డుపైకి రావాల్సి వస్తోంది. దీంతో సచివాలయంలో వారు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ సేవలకు వెళ్లిన ప్రజలు వారి కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. కనీసం సిబ్బంది ఎప్పుడు వస్తారో చెప్పలేని దుస్థితి సచివాలయాల్లో నెలకుంది. వలంటీర్లు ఉన్నప్పుడు ప్రతిదీ తమకు ఇంటివద్దే తెలిసేదని, వారు లేకపోవడం తమకు ఇబ్బందిగా ఉందంటూ వారి సేవలను ప్రజలు గుర్తు చేసుకోవడం గమనార్హం.

## మధ్యంతర భృతి ప్రకటించాలి

**పెద్దతిప్పసముద్రం :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి 12వ పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, మధుసూదన్ డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం మండలానికి వచ్చిన ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ అన్ని విభాగాల ఉద్యోగులతో సమానంగా ఉపాధ్యాయులకు కూడా జీత భత్యాల చెల్లింపులు జరగాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు మురళీ, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, లక్ష్మినారాయణ, సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## లక్ష దీపారాధనలో పాల్గొనండి

**కలకడ :** కార్తిక పౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న లక్ష దీపారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని దీపారాధనతో ముక్తి మార్గం పొందాలని ఝరికోన శివమాల పీఠక బృందం వారు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఝరికోనలో సాయంత్రం 4గంటలకు రుద్రాభిషేకం, 6గంటలకు శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, దీపారాధన, అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

## మల్లయ్యకొండపై పూజలు


పూజ కార్యక్రమంలో కనుగొండ మద్దిరెడ్డి

**తంబళ్లపల్లె:** మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త కనుగొండ మద్దిరెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు ఆయనకు స్వాగతం పలికి స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనం కల్పించి సంప్రదాయబద్దంగా తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# భూ సమస్యలపై వెంటనే స్పందించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ ఫణికుమార్

**కలకడ :** సీఎంఓ, స్పందన, డాటెడ్ ల్యాండ్ సమస్యలపై వెంటనే సిబ్బంది స్పందించి నివేదికలు సిద్ధం చేయాలని తహసీల్దార్ ఫణికుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేసి రెవెన్యూ గ్రామాల వారిగా ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులు, జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఫిర్యాదులు, డాటెడ్ ల్యాండ్ సమస్యలను నివేదించాలన్నారు. స్పందనలో వచ్చిన రెండు ఫిర్యాదులపై వెంటనే సమాచారం సేకరించి నివృత్తి చేయాలన్నారు, ధ్రువపత్రాల మంజూరులో చొరవచూపాలని, ఇంటిపేరు నమోదులో పూర్తి పేరు లేనివారికి ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు నివేదించాలన్నారు. నాన్‌అవైలబులిటీ ధ్రువపత్రం మంజూరు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని, త్వరలో మంజూరుకు అనుమతిరావచ్చని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

# మండల మీట్ నిర్వహణలో వాయిదాల తంతు


ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇరువర్గాలు

**పెద్దమండ్యం :** మండల సర్వసభ్య సమావేశాల నిర్వహణలో ఒకే తంతు కొనసాగుతోంది. సమావేశం నిర్వహణపై అధికారులు ముందుగా ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచ్‌లకు, మండలంలో అన్ని శాఖల అధికారులకు సర్క్యులర్‌లు ఇవ్వడం, సమావేశం నిర్వహణ రోజు వాయిదా వేస్తున్నట్లు తిరిగి సమాచారం ఇవ్వడం జరుగుతోంది. ఈ తంతు మూడోసారి కొనసాగింది. అయితే రెండు సార్లు లా అండ్ ఆర్డర్ సమస్య కారణం చూపి వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించగా, మూడోసారి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా సమావేశం వాయిదా వేస్తున్నట్లు అధికారులు సమాచారం ఇచ్చారు. తాజాగా మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు అధికారులు సమాచారం ఇచ్చినా ఎంపీడీఓ కార్యాలయానికి ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ వచ్చారు. కాగా కూటమి నాయకులు కొందరు కార్యాలయం వద్దకు ముందుగానే చేరుకొని గేటుకు తాళాలు వేశారు. అయితే పోలీసులు రావడంతో గేటు తాళాలు తీశారు. ఈ సమయంలో ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ చాంబర్‌లోకి వెళ్లారు. సమావేశం విషయమై సమాచారం ఇవ్వడం, వాయిదా వేయడంపై ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, సభ్యులు ఎంపీడీఓ శ్రీధర్ రావుతో మాట్లాడారు. కూటమి నాయకుల తీరుపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. సమావేశం నిర్వహించేందుకు కోరం ఉన్నా తరచూ వాయిదా పర్వం ఎందుకు కొనసాగిస్తున్నారో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓతో మాట్లాడుతుండగా కూటమి నాయకులు అభ్యంతరం తెలిపారు. కూటమి నాయకులతో ములకలచెరువు సీఐ రాజా రమేష్, తంబళ్లపల్లె ఎస్ఐ లోకేష్ రెడ్డి మాట్లాడారు. ఎంపీపీ చాంబర్‌లో ఎంపీటీసీ సభ్యులతో మాట్లాడుతున్నారని, సమావేశం జరగలేదని తెలిపారు. ఈ క్రమంలో ఇరువర్గాలు కార్యాలయం వద్దకు చేరుకోవడంతో పోలీసులు భారీగా మోహరించారు. పోలీసుల సూచన మేరకు ఇరువర్గాలు వెళ్లిపోవడంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## నిమోనియా లేని బాల్యాన్ని ఆశిద్దాం

**పీలేరు రూరల్ :** నిమోనియా లేని బాల్యాన్ని ఆశిద్దామని జిల్లా వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. బుధవారం పీలేరు నిర్వహించిన చిన్నపిల్లలు, గర్భిణుల వ్యాధి నిరనోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో నిమోనియా ఒకటని తెలిపారు. అవగాహనతోనే వ్యాధి నియంత్రణ సాధ్యమన్నారు. హెచ్ఈ కొండయ్య, పర్యవేక్ష కులు కుసుమ, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

## కర్నాటక మద్యం తరలిస్తున్న మహిళ అరెస్టు

**మదనపల్లె :** కర్నాటక మద్యం తరలిస్తున్న మహిళను బుధవారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. మండలంలోని పోతబోలు శాంతినగర్‌కు చెందిన ఎస్.బాబు భార్య ఎస్.రెబాక(48) మదనపల్లె-సీటీఎం మార్గంలోని పోతబోలుక్రాస్ వద్ద ప్లాస్టిక్ బ్యాగులో కర్నాటకు చెందిన అమృత్ సిల్వర్‌కప్, వీఎస్‌ఓపీ ఇండియన్ బ్రాందీ టెట్రాప్యాకెట్లు 108 డిప్‌లను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.4,320 ఉంటుందన్నారు. నిందితురాలిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలో జరిగింది. పట్టణంలోని కమ్మగడ్డవీధిలో నివాసం ఉన్న అబ్దుల్ రెహమాన్ కుమారుడు నౌషాద్‌అలీ(47) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల కుటుంబ సమస్యలతో పలుచోట్ల అప్పులుచేశాడు. రుణదాతల ఒత్తిడి అధికం కావడంతో మనస్తాపం చెంది ఇంటివద్దే ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## ఆలయంలో చోరీకి విఫలయత్నం

**పెద్దతిప్పసముద్రం :** మండలంలోని టి.సదుంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారని ధర్మకర్త అశోక్ తెలిపారు. 25 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు యువకులు ముఖాలకు మాస్కులు ధరించి గోడ దూకి సీసీ కెమెరాలను పక్కకు తిప్పి ఇనుప రాడ్లతో ఆలయం తలుపును పగులగొట్టే ప్రయత్నం చేసి విఫలమై తిరిగి వెళ్లినట్లు సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయిందన్నారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## మదనపల్లె సబ్‌జైలులో జైళ్లశాఖ డీఐజీ తనిఖీ

**మదనపల్లె :** పట్టణంలోని స్పెషల్ సబ్‌జైలును జైళ్లశాఖ రాయలసీమ డీఐజీ రాజేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. జైలు గదులను పరిశీలించి, ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సబ్ జైలు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశా రు. ఖైదీలకు మెరుగైన వసతులతో పాటు వైద్యసౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సబ్‌జైళ్లశాఖ అధికారి వేణుగోపాల్, మదనపల్లె స్పెషల్ సబ్ జైలు సూపరింటెండెంట్ రామకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులపై ఆకస్మిక దాడులు

**కురబలకోట:** కురబలకోట మండలంలో విజయవాడ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముదివేడు గ్రామం దిగువ గొల్లపల్లెకు చెందిన రెడ్డెప్ప (41) ముదివేడు బస్ స్టాప్ వద్ద 52 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని కలిగి ఉండగా అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ మహిళా ఎస్ఐ డార్కస్ తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో టీడీపీ వారే మద్యం షాపులు నిర్వహిస్తున్నారు. ఈ మద్యం కూడా ఆ పార్టీకి చెందిన మద్యం షాపు నుంచే సరఫరా అయి ఉంటుందని టాస్క్‌ఫోర్సు అధికారులు భావిస్తున్నారు. మరో వైపు ఊరూరా బెల్ట్ షాపులు పెడితే ఎలా కాపురాలు చేయాలి చంద్రన్నా అంటూ వివిధ గ్రామాల మహిళలు మండిపడుతున్నారు.

## ఘనంగా మంగళకైశిక ద్వాదశి పూజలు

**కేవీపల్లె :** మండలంలోని మహల్‌రాజుపల్లె పంచాయతీ రామిరెడ్డిగారిపల్లె వద్ద శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళకైశిక ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ గోవిందుని పూజించాలని, ధర్మ మార్గంలో పయనించాలని నిర్వాహకులు కోరారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పూర్తి చేయాలి

**తంబళ్లపల్లె:** మండల కేంద్రంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లు పూర్తి చేయాలని ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి ఏఈ శేషాద్రిని ఆదేశించారు. బుధవారం ఆయన తంబళ్లపల్లె టీవీ స్టేషన్, తూర్పు హరిజనవాడ, నల్లగుట్టలో జరుగుతున్న పనులను పరిశీలించారు. 63 కె.వి ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 100 కె.వి. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం తంబళ్లపల్లె సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. కెపాసిటర్ బ్యాంకు పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

**కేవీపల్లె :** మండలంలో హౌసింగ్‌లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో సుధాకర్, ఏపీడీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, ఉపాధి సిబ్బందిచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 1350 ఇళ్లకు గానూ 980 ఇళ్లు పూర్తైనట్లు తెలిపారు. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి వేగవంతం చేయాలని కోరారు.

## క్రికెట్ పోటీల్లో రాయల్ చాలెంజర్స్ విజయం

**మదనపల్లె సిటీ:** స్థానిక బీటీ కాలేజీ మైదానంలో విజయభారతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో క్రికెట్ లీగల్ మ్యాచ్ పోటీలు నిర్వహించారు. ఫైనల్స్‌లో రాయల్ చాలెంజర్స్ జట్టు విజయం సాధించింది. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొనగా నాలుగు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు.